క్లుప్తంగా

నేడు కళాశాల భవనం ప్రారంభం

తాండూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెండు దశాబ్దాల తర్వాత తరగతి గదుల కొరత తీరింది. రూ.2కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఏడాది క్రితం నాటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శిథిల భవనాన్ని నేల మట్టం చేయించి, ఆ స్థలంలోనే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. కాగా.. నేడు కళాశాల భవనంతో పాటు ఎన్‌టీఆర్ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

ముమ్మరంగా మిషన్ భగీరథ సర్వే



సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

దౌల్తాబాద్: మిషన్ భగీరథ నల్లాల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భగీరథ యాప్‌లో సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. మండల పరిధి దౌల్తాబాద్, చల్లాపూర్, కుదురుమళ్ల, గోకఫసల్‌వాద్ పంచాయతీల్లో సర్వే పూర్తి కావచ్చిందని, మిగతా గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ రవీందర్ ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దుద్యాల్: మండల కేంద్రంలో మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి సరస్వతి ఆధ్వర్యంలో సంఘం మాజీ అధ్యక్షుడు మేర్గు వెంకటయ్య సహకారంతో కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా లాల్కోట బుగ్గప్ప, ఉపాధ్యక్షుడిగా బుగ్గప్ప, సెక్రటరీగా కొండవని అనంతయ్య, సభ్యులుగా అబ్బ నర్సింలు, చెన్నసీ రాములు, జోగు వెంకటయ్య, పసుల సాయిలు, బోయిన రాములు, మదిరేపల్లి మల్లేశ్‌లను నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ చెరువుల్లో చేపల వేట ద్వారా అందరూ అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబం కలిసి మెలిసి ఉండాలని ఆమె సూచించారు.

ఉచితంగా యూరియా పంపిణీ



యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న సైబేజ్ ప్రతినిధులు

పూడూరు: గ్రామ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల చేయూత అభినందనీయమని మాజీ సర్పంచ్ బుచ్చన్న అన్నారు. బుధవారం మండల పరిధి దేవనోనిగుడలో రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ 65 మంది రైతులకు ఉచితంగా 390 యూరియా బస్తాలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సైబేజ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇకమీదట రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీఎస్‌ఆర్ సురేష్ కుమార్, సీతారాంరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణ, కోశాధికారి వెంకటయ్య, కార్యదర్శి విశ్వనాథం, భాస్కర్, రైతులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం అలవర్చుకోండి



పూజా కార్యక్రమంలో తహసీల్దార్ తదితరులు

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు సూచించారు. బుధవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామ శివారులోని కాళికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భక్తిభావాన్ని అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని సూచించారు. కార్యక్రమంలో గిర్దవరి వెంకట గిరి, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ కుమార్, మాజీ సర్పంచ్ వెంకట్, నాయకులు అంజునాయక్, శివపవార్, ఆనంద్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ నేడు

దుద్యాల్: మండల పరిధి ఈర్లపల్లి, సంత్రకుంటతండాలో గురువారం గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పనుల ఆడిట్ రెండు రోజుల పాటు జరిగిందని, దీనికి సంబంధించి సభను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆరోగ్య 'సిరి'ధాన్యాలు

చిరు ధాన్యాలు చిన్నగా ఉన్నాయని చిన్నచూపు చూడవద్దు. రాగులు, సజ్జలు, కొర్రల లాంటి గింజలు గొప్పగా కనిపించకపోవచ్చు. కానీ ఆరోగ్యానికి అవి చేసే మేలు అనంతం. ఆరోగ్యంగా ఉంటే.. అంతులేని సిరి మనచెంతే..



పెరిగిన చిన్నగింజల వినియోగం
- వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు
- మిల్లెట్స్‌తో పెరిగిన ఆహార పదార్థాల తయారీ
- ఆరగించేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు
- సాగు చేసేందుకు ముందుకు వస్తున్న రైతులు

దుద్యాల్: రెడీమెడ్ ఫుడ్‌కు అలవాటు పడిన జీవితాలు.. పోషక విలువలు ఉన్న ఆహారం కోసం ఎదురు చూస్తున్నాయి. సగటు మనిషి పౌష్టికాహార ఆహార పదార్థాల కోసం అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా చిరుధాన్యాలతో కూడిన వంటకాలను ఆరగించేందుకు మక్కువ చూపుతున్నారు. ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండగా.. వినియోగం మేరకు గింజల పంటలను పెంచేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ప్రయోజనాలు

చిరుధాన్యాల్లో జొన్నలు, సజ్జలు, రాగులు ప్రధానమైనవి. అరికెలు, సామలు, అండ్రు కొర్రలు, ఊదలు లాంటి వాటిని సూక్ష్మ ధాన్యాలుగా పిలుస్తారు. వరి, గోధుమలకన్నా ఇవన్నీ అధిక పోషకాలను కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటి వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయని, శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, రక్తపోటు, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులను అదుపులో ఉంచుతాయని, రోగ నిరోధక శక్తిని పెంచుతాయని స్పష్టం చేస్తున్నారు.

పెరిగిన వినియోగం



కొర్రలతో వండిన అన్నం



కొర్రలతో చేసిన ఇడ్లీ

పాతకాలపు ఆహారపు అలవాట్లు క్రమంగా ముందుకు వస్తున్నాయి. కొన్ని దశాబ్దాల క్రితం వరకు ఎక్కువగా చిరుధాన్యాలనే ఆహారంగా తీసుకునేవారు. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి వాటితో రొట్టెలు చేసుకొని తినివారు. కొర్రలు, సామలు, అండ్రు కొర్రలు వంటి వాటితో అన్నం వండుకొని భుజించేవారు. కానీ చాలా కాలంగా పట్టణంతో పాటు పల్లె ప్రాంత ప్రజల జీవన శైలిలో చిరుధాన్యాల వినియోగం తగ్గింది. వరి అన్నం, ఫాస్ట్ ఫుడ్‌ను అధికంగా తింటున్నారు. ఫలితంగా చిరుధాన్యాల సాగు విస్తీర్ణత, పండించే రైతులు తగ్గుతూ వస్తున్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి కొని తెచ్చుకుంటున్న అనారోగ్య సమస్యలు, కోవిడ్ తర్వాత ప్రజల ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయి. చిరుధాన్యాల ప్రయోజనాలు, కలిగే లాభాలు తెలిసి వచ్చాయి.

అన్నం, ఇడ్లీ, దోసెలు

చిరుధాన్యాలతో రొట్టెలు, అన్నం వంటివి కాదు.. ప్రస్తుతం ఇడ్లీ, దోసె, ఉప్మా, పొంగల్ వంటి తదితర పదార్థాలను తయారు చేస్తున్నారు. కొర్రలు, అండ్రు కొర్రలు, రాగులతో లడ్డు, మురుకులు, కేసరిలు తదితర రకరకాల వంటలు ఇళ్లలో వండుకుంటున్నారు. దుకాణాల్లోనూ వీటితో చేసిన ఆహారాన్ని విక్రయిస్తున్నారు. కొందరు ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు.

వారంలో మూడు రోజులు



అధిక పోషకాలు ఉన్న ఆహారం తినాలనే ఉద్దేశంతో చిరుధాన్యాలతో వంటకాలు చేస్తున్నాం. వారంలో మూడు రోజులు కొర్రలతో అన్నం, దోసెలు, రాగులతో లడ్డూలు, ఇడ్లీలు తయారు చేసుకుంటున్నాం. మా ఇంట్లో నిత్యం పచ్చజొన్న రొట్టెలు, బ్రౌన్ రైస్ భోజనం ఆరగిస్తాం. ధరలు అధికమైనా సరే.. కావాలసిన గింజలను కొంటాం. వీటి భోజనం చాలా రుచిగా ఉంటుంది. అలవాటు పడితే వీడటం కష్టం. నాలుగేళ్లుగా తింటున్నాం.

– మానస, గృహిణి, హస్నాబాద్.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ప్రజల అవసరాల మేరకు చిరుధాన్యాలను పండించాలని రైతులను ప్రోత్సహిస్తున్నాం. మార్కెట్లో వాటికి మంచి ధర పలుకుతోంది. సాగు గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గ్రామాల్లో మా ఏఈఓలు అందుబాటులో ఉన్నారు. వారిని సంప్రదించి, అవసరమైన సలహాలతో గింజలను సాగు చేయండి. మంచి దిగుబడితో పాటు.. లాభాలు పొందండి. ప్రజలకు ఆరోగ్యాన్ని ప్రసాదించండి.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో ఎలాంటి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పారిశుద్ధ పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని, వీధులు, రోడ్లలో చెత్త చెదారం లేకుండా చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, పురపాలక సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



మరుగు దొడ్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

పరిగి: పేద విద్యార్థులకు అండగా ఉంటామని మదునాపంతుల ఫౌండేషన్ అధినేత కిరణ్ అన్నారు. మండల పరిధి మధారం గ్రామం ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లను మండల విద్యాధికారి హరిశ్చందర్‌తో కలిసి ఎంపీపీ అరవింద్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎల్లప్పుడూ ముందుంటామని చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్ల నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కారం

- కలిసికట్టుగా పనిచేద్దాం.. మండలాన్ని అభివృద్ధి చేద్దాం
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లలిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత

మర్పల్లి: సమన్వయంతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ బట్టు లలిత అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు లేవనెత్తిన ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. తాగునీటికి ఇబ్బందులు కలగకుండా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని భగీరథ ఏఈకి చెప్పారు. జెడ్పీటీసీ మధుకర్ మాట్లాడుతూ అభివృద్ధి–సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని, కలిసి పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు సమయ పాలన పాటిస్తే.. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చేయవచ్చని తెలిపారు. గృహజ్యోతి కింద జీరో బిల్లు రాని వారికోసం మండల పరిషత్ కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేశామని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య చెప్పారు.

దెబ్బతిన్న రోడ్లు

ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరమ్మతుల కోసం నిధులు మంజూరు అయినా పనులు ఎందుకు చేపట్టడం లేదని ఆర్‌అండ్‌బీ డీఈని జెడ్పీటీసీ ప్రశ్నించారు. అనంతరం పనులు త్వరలో ప్రారంభించాలని ఆయన కోరారు. అంతకు ముందు శాఖల వారీగా సంబంధిత అధికారులు తమ ఎజెండా అంశాలను చదివి వినిపించగా.. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సోయెల్, తహసీల్దార్ గణేశ్, ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, సూపరింటెండెంట్ కృష్ణరావు, మండల విద్యాధికారి విద్యాసాగర్, అధికారులు, ఎంపీటీసీలు, జీపీ ప్రత్యేక అధికారులు ఉన్నారు.

వ్యర్థాల తొలగింపునకు వేలం

తాండూరు టౌన్: చికెన్, మటన్, ఫిష్ మార్కెట్లలో పోగైన వ్యర్థాల తొలగింపు కోసం పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట రికార్డు స్థాయి పలికింది. రాష్ట్రంలోనే లక్ష కంటే తక్కువ జనాభా ఉన్న మున్సిపల్ పరిధిలో రూ.30.65 లక్షలకు వ్యర్థాల తొలగింపును దక్కించుకోవడం ఇదే తొలిసారి అని, ఇదే రాష్ట్ర రికార్డు అని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి తెలిపారు. కొడంగల్‌కు చెందిన ఎండీ రఫీ వేలం దక్కించుకున్నారు.

22 నుంచి నౌషా బాలేసాబ్ ఉర్సు ఉత్సవాలు

యాలాల: మండల కేంద్రంలో నౌషా బాలేసాబ్ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న గంధం ఊరేగింపు, 23న దీపారాధన(చిరాగ్)తో పాటు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. 24న జ్యారత్‌తో ఉత్సవాలు ముగియనున్నాయని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

ధారూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి అలంకరించారు. అనంతరం అష్టోత్తర నామాలతో పూజారులు చెన్నబసవయ్యస్వామి, కుమారస్వామీలు హోమం చేశారు. భక్తులకు తీర్థ, ప్రసాదం పంపిణీ చేశారు.

గుడి నిర్మాణానికి విరాళం

కొడంగల్: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయం సమీపంలో నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కొడంగల్‌కు చెందిన విశ్రాంత సైనికుడు చాకలి రాములు రూ.51వేలు విరాళం ఇచ్చారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు పి.శ్రీనివాస్‌గౌడ్‌లకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

నేడు నులిపురుగు నివారణ దినోత్సవం

దౌల్తాబాద్: నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ముందస్తు ప్రణాళికతో నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రతన్‌లాల్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడారు. గురువారం నిర్వహించే కార్యక్రమంలో 1–19 సంవత్సరాల వయసు వారికి అల్బెండజోల్ మాత్రలు వేస్తామని చెప్పారు. మండల పరిధి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని 8,247 మందికి టాబ్లెట్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

16,857 మాత్రల పంపిణీ

కుల్కచర్ల: నులి పురుగు నివారణ మాత్రలతో అనారోగ్య సమస్యలు దరిచేరవని మండల వైద్యాధికారి మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అల్బెండజోల్ మాత్రల పంపిణీపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20వ తేదీ నుంచి 27 వరకు కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థులందరికీ మాత్రలను అందజేయాలని సూచించారు. మండల పరిధిలో 16,857మందికి మాత్రలు వేయాల్సి ఉందని చెప్పారు. రత్నలత, స్వరూపరాణి, యాదమ్మ, విజయలక్ష్మి, వెంకటయ్య, అంజు, రత్నమ్మ, వెంకటమ్మ, సుజాత ఉన్నారు.

ఆందోళన వద్దు.. అర్హులందరికీ 'జీరో'

- 'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోండి
- చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ అనితగౌడ్

అనంతగిరి: గృహజ్యోతి పథకం అందని వారు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ఉచిత విద్యుత్ అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజాపాలన కేంద్రం ఏర్పాటు చేసిందని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. ఉచిత కరెంట్ (జీరో) బిల్లు రానివారు ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అర్హులైన కొందరికి వర్తించడం లేదని, ఈ మేరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుతో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సేవా కేంద్రం కౌంటర్‌ను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. మరోసారి పూర్తి వివరాలతో అర్జీ పెట్టుకుంటే మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని మంజుల వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యలు చెప్పుకునేందుకే..

తాండూరు రూరల్: ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు 'ప్రజాపాలన' సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తాండూరు ఎంపీపీ అనితగౌడ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు జీరో బిల్లు వర్తిస్తుందని పేర్కొన్నారు. అర్హులై ఉండి.. జీరో బిల్లు రానివారు ఉంటే.. సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, సిబ్బంది సత్యనారాయణరెడ్డి ఉన్నారు.



అనంతగిరి: ప్రజాపాలన కౌంటర్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంజుల

బోనఫైడ్ పంచాయితీ

- విద్యార్థి తండ్రి, ప్రధానోపాధ్యాయుడు మధ్య వాగ్వివాదం
- ఎంఈఓ వెంకటయ్యకు ఫిర్యాదు



పాఠశాల వద్ద విద్యార్థి శరత్‌తో తండ్రి రాములు

తాండూరు రూరల్: బోనఫైడ్ విషయంలో విద్యార్థి తండ్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇదే విషయమై విద్యార్థి తండ్రి మండల విద్యాధికారికి బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి ఉద్దాండపూర్ గ్రామానికి చెందిన బుడగజంగం రాములు కుమారుడు శరత్.. అదే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. కుమారుడికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రంలో బోనఫైడ్ ను గుర్తింపుగా చూపించాల్సి ఉండగా.. ఐదు రోజుల క్రితం బోనఫైడ్‌ను పాఠశాల నుంచి తీసుకెళ్లారు.

బడిలో కూర్చోవద్దు.. ఇంటికెళ్లు

విద్యార్థి శరత్ బుధవారం యథావిధిగా పాఠశాలకు వెళ్లగా ప్రధానోపాధ్యాయుడు రవిందర్‌కుమార్ శర్మ బాలుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థిని ఉద్దేశిస్తూ.. 'మీ తండ్రి రాములు నీ బోనఫైడ్ తీసుకెళ్లాడు. నీవు పాఠశాలలో కుర్చోవద్దు. ఇంటికి వెళ్లు' అని ఆదేశించగా.. శరత్ రోధిస్తూ ఇంటికి వెళ్లి జరిగిన విషయం తండ్రికి చెప్పారు. దీంతో బాలుడి తండ్రి పాఠశాలకు వెళ్లి.. జరిగిన దాని గురించి హెచ్‌ఎంను అడగగా.. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. మీ కొడుకును పాఠశాలకు అనుమతించనని హెచ్‌ఎం తేల్చిచెప్పడంతో.. విద్యార్థి తండ్రి రాములు, తాండూరు మండల ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై విద్యాధికారి వెంకటయ్యను వివరణ కోరగా.. పాఠశాలలో జరిగిన సంఘటన తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. విచారణ జరిపి, శరత్‌ను పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం కల్పిస్తానని వివరించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పరిగి: రాహుల్ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు



పెద్దేముల్.. పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం
- రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులు
- రక్తదానం, రోగులకు పండ్లు పంపిణీ చేసిన కార్యకర్తలు

పరిగి: దేశం ఇంత అభివృద్ధి చెందిందంటే కాంగ్రెస్‌తోనే అది సాధ్యమైందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏఐసీసీ కీలక నేత, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. రాహుల్ కుటుంబం దేశ ప్రయోజనాలకు అంకితం అయిందని పేర్కొన్నారు. ఇందులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు తౌరియనాయక్, నాయకులు ఆనందం, మల్లేశ్, పాలాద్రి శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: యువత రాజకీయాల్లోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని డీసీసీ ప్రధాన కార్యదర్శి షకీల్ అన్నారు. మండల మన్నేగుడ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఇందులో డీసీసీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, రహీం తదితరులు ఉన్నారు.

పండ్లు పంపిణీ

పెద్దేముల్: రాహుల్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇందులో మాజీ ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ రమేష్‌కుమార్, మైనార్టీ సెల్ స్టేట్ కన్వీనర్ రియాజ్, తాండూరు ఏ–బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సయ్యద్ మినాజ్, తట్టెపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింలు, రాజు, సయ్యద్ షబీర్, పెంటప్ప, సాయిబాబ ఉన్నారు.

రక్త దానం

కొడంగల్: రాహుల్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాహుల్‌ను ప్రధాన మంత్రిని చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. గాంధీ కుటుంబం దేశానికి ఎంతో సేవ చేసిందని తెలిపారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్‌లు ప్రధాన మంత్రిగా పనిచేసి దేశ ప్రజల మన్ననలు పొందారని, వారి వారసుడు రాహుల్ ప్రధాని అవుతారని ఆశాభావం వ్యక్తంచేశారు.

సంక్షిప్త వార్తలు

◆ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

నవాబుపేట: వానాకాలం సీజన్‌లో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీ సీఈఓ సుధీర్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జీపీ కార్యదర్శులు, అధికారులతో ఆయన మాట్లాడారు. వ్యాధుల సీజన్ కాబట్టి పల్లెలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ విజయ్ కుమార్ ఉన్నారు.

◆ అడ్డుకట్ట వేయాలి

అనంతగిరి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారం చేస్తూ.. తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు దండుకుంటున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు ఆరోపించారు. బుధవారం వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం పాఠశాలకు కొద్ది దూరంలో ఓ ఇంట్లో అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయించారన్న సమాచారంతో ఏబీవీపీ నాయకులు అక్కడికి చేరుకుని, విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి, దుకాణాన్ని సీజ్ చేయించారు. అనంతరం హరీశ్ మాట్లాడారు. ఉన్నతాధికారులు ఇలాంటి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని కోరారు.

◆ వైద్య పరీక్షలు తప్పనిసరి

మర్పల్లి: ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయూస్ డాక్టర్ విజయకుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం 20 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఎచ్ఈఓ తిరుపతయ్య, సూపర్ వైజర్లు అమరేశ్వరీ, రాణి, సిబ్బంది దీప, లావణ్య తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థులకు చేయూత

కొడంగల్ రూరల్: యువ 24ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధి ఆశమ్మకుంటతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్లేట్లు, వాటర్ బాటిల్స్, బ్యాగులు, కూర్చోవడానికి ఫ్లోర్‌నైట్ తదితర సామగ్రిని అందజేశారు.